క్లుప్తంగా

ఎం. అలమండలో సీఎం జగన్ జన్మదిన వేడుకలు రేపు

దేవరాపల్లి : మండలంలోని ఎం. అలమండలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబూరావు తెలిపారు. ఈ వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేస్తారని, అనతరం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేస్తారన్నారు. మండల ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని బాబూరావు కోరారు.

దేశాభివృద్ధే లక్ష్యం కావాలి



శిరిజాంలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో తదితరులు

చీడికాడ : ప్రతి పౌరుడు దేశాభివృద్ధి లక్ష్యంగా ఆలోచన చేయాలని ఎంపీడీవో జయప్రకాష్ పిలుపునిచ్చారు. మంగళవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర శిరిజాం, కోనాం గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాన్ని అభివృద్ధిపథంలో నడిపే వారిని గౌరవించాలన్నారు. గ్రామస్తు లు, అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యదర్శి పద్మ, సన్యాసిరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

534 హెక్టార్లలో వరికి నష్టం

మాకవరపాలెం: మండలంలో 534 హెక్టార్లలో వరి పంటకు నష్టం వాటిల్లిందని ఏవో చిరంజీవి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిగ్‌జాం తుపాను కారణంగా నీట మునిగిన పంట వివరాలను నమోదు చేశామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 15 సచివాలయాల పరిధిలో 1510 మంది రైతులకు చెందిన 534 హెక్టార్లలో వరి పంటకు నష్టం వాటిల్లిందని ఏవో తెలిపారు. రైతుల వివరాలతో కూడిన జాబితాలను బుధవారం నుంచి రైతుభరోసా కేంద్రాల్లో ఉంచుతామని, ఈ నెల 22లోపు రైతులు తమ అభ్యంతరాలను తెలియజేసుకోవచ్చన్నారు.

ఇంధన పొదుపుపై కళా జాత



ఇంధన పొదుపుపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

మాకవరపాలెం: ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన వారపు సంతలో కళా జాత నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారుల బృందం సభ్యులు ఇంధన పొదుపు, దాని ద్వారా కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ సిబ్బంది, లైన్‌మెన్లు పాల్గొన్నారు.

మల్లంపాలెంలో ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవలు



పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి సుబ్రహ్మణ్యం

కె.కోటపాడు : మల్లంపాలెం గ్రామంలో మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవలందించారు. చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి వి.వి. సుబ్రహ్మణ్యం 134 మందికి ఆరోగ్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇచ్చారు. గర్భిణులకు ఆరోగ్య తనిఖీలతో పాటు బీపీ, సుగర్ పరీక్షలు జరిపారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ డీఎస్ఎన్ రాజు, ఎంఎల్‌హెచ్‌పీ మాధవి, ఏఎన్ఎం ఉష తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన



నిరసనలో పాల్గొన్న న్యాయవాదులు

నర్సీపట్నం : న్యాయవాదులు మంగళవారం విధులు బహిష్కరించి న్యాయస్థానం ఆవరణలో నిరసన దీక్ష చేపట్టారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ హక్కుల చట్టాన్ని రద్దు చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఆ చట్టం వల్ల సామాన్యులు నష్టపోతారన్నారు. ఈ దీక్షలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణ, గోవిందరావు, సభ్యులు మాకిరెడ్డి బుల్లిదొర, సింగంపల్లి రామలక్ష్మి, మెట్టా ప్రభాకర్, విజయ్‌ప్రసాద్, మూర్తి పాల్గొన్నారు.



నాడు శిథిలం.. నేడు సుందరం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి అన్ని రంగాల్లో అభివృద్ధి పరుగులు తీస్తోంది. గతంలో అభివృద్ధికి నోచుకోని సీసీ రోడ్లు, డ్రెయిన్లు, కాలువలు, కల్వర్టుల నిర్మాణం ఊపందుకుంది. తద్వారా ప్రజలకు మెరుగైన సౌకర్యాలు సమకూరే వెసులుబాటు కలుగుతోంది. అభివృద్ధి విషయంలో ప్రభుత్వం ఖర్చుకు ఏమాత్రం వెనుకాడకుండా కోట్లాది రూపాయలు వెచ్చిస్తోంది. స్థానిక ప్రజా ప్రతినిధులు సత్వరం పనులు పూర్తయ్యేలా శ్రద్ధ తీసుకుంటూ త్వరితగతిన పనులు పూర్తయ్యేలా జాగ్రత్త వహిస్తున్నారు.

- కోట్లాది రూపాయలతో నూతన సీసీ రోడ్ల నిర్మాణం
- సులభంగా.. సౌకర్యవంతంగా ప్రజల ప్రయాణాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు



పెదబొడ్డేపల్లిలోని సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణేష్ (ఫైల్)



27వ వార్డు శివపురంలో నిర్మించిన సీసీ రోడ్డు



24వ వార్డు ధనిమిరెడ్డి వీధిలో నిర్మించిన సీసీ రోడ్డు



శారదానగర్‌లో నిర్మించిన సీసీ రోడ్డు

సీసీ రోడ్ల అభివృద్ధి ఇలా..

- మున్సిపాలిటీ పరిధిలోని 28 వార్డుల్లో రూ.11 కోట్లతో జరుగుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులు
- గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.9 కోట్లు, ఆర్థిక సంఘం నిధులు రూ.2 కోట్లు కేటాయింపు
- రహదారి కష్టాలు తీరుతున్నాయని హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

నర్సీపట్నం: మున్సిపాలిటీలో అభివృద్ధి పరుగులు తీస్తోంది. గతంలో గతుకులు, శిథిలమైన రోడ్లను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎక్కడికక్కడ అభివృద్ధి చేస్తూ ప్రజల మన్ననలు అందుకుంటోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వార్డుల్లో మౌలిక వసతులు సమకూరక ప్రజలు ఇబ్బంది పడ్డారు. రోడ్లు శిథిలమై, డ్రైనేజీలు పాడుబడి ప్రజలు నానా ఇబ్బందులు పడేవారు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడి, స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం మున్సిపాలిటీని వైఎస్సార్‌సీపీ హస్తగతం చేసుకున్న నాటి నుంచి వార్డుల్లో అభివృద్ధి పనులు జోరందుకున్నాయి. మున్సిపాలిటీలో మొత్తం 28 వార్డులు ఉన్నాయి. ప్రాధాన్యతను బట్టి మౌలిక వసతులు, సీసీ రోడ్లు, డ్రెయిన్లు, కాలువలు, కల్వర్టుల నిర్మాణం చేపడుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కోట్లాది రూపాయలతో పనులు జరుగుతుండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

28 వార్డుల్లో రూ.11 కోట్లతో పనులు..

మున్సిపాలిటీ పరిధిలోని 28 వార్డుల్లో రూ.11 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. గడప గడపకు మన ప్రభుత్వం నిధులు మొత్తం రూ.9 కోట్లు, ఆర్థిక సంఘం నిధులు రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ నిధులతో ప్రణాళికాబద్ధంగా పట్టణంలో ప్రజలకు అవసరమైన సీసీ రోడ్లు, డ్రెయిన్ల పనులు చేయించారు. ప్రస్తుతం గడప గడపకు నిధులతో వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, ఇతర అభివృద్ధి పనులు చేస్తున్నారు. పూర్తయిన పనులను ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ వెంటనే ప్రారంభించి ప్రజా వినియోగంలోకి తీసుకువస్తున్నారు.

రహదారి సమస్య తీరింది..



మేము 20 సంవత్సరాలుగా గరగాలమ్మ వీధిలో నివాసం ఉంటున్నాం. రోడ్డు వేయాలని గత పాలకులకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. ఎమ్మెల్యే గణేష్ చొరవతో రహదారి కష్టం తీరింది. ప్రభుత్వం చేసిన మేలు మర్చిపోలేం.

– టి.రాజేశ్వరి, పెదబొడ్డేపల్లి

శరవేగంగా కొత్త రోడ్ల నిర్మాణం..



ఎమ్మెల్యే గణేష్ సహకారంతో పలు కాలనీల్లో కొత్త రోడ్ల నిర్మాణంతో పాటు అభివృద్ధి పనులు చేస్తున్నాం. ప్రధానంగా మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించాం. గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.9 కోట్లు, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తున్నాం.

– బోడపాటి సుబ్బలక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్

మర్యాదపూర్వక కలయిక



డిప్యూటీ సీఎం ముత్యాల నాయుడును సత్కరిస్తున్న కొండలరావు తదితరులు

మాడుగుల : మార్కెట్ కమిటీ నియోజకవర్గ పునర్విభజనలో భాగంగా మాడుగుల నియోజకవర్గంలో 20 మంది సభ్యులతో కూడిన వ్యవసాయ మార్కెటింగ్ కమిటీని నూతనంగా ఏర్పాటు చేశారు. దీనికి నూతనంగా నియమితులైన ఏఎంసీ చైర్మన్ శేనాపతి కొండలరావు డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడును తారువా క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన రైతుల తరపున డిప్యూటీ సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కరణం రాము తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవో-1గా జాన్‌ప్రసాద్ నియామకం



ఎంఈవోను మర్యాదపూర్వకంగా కలిసిన పీఆర్‌టీయూ సభ్యులు

మాకవరపాలెం : ఎంఈవో-1గా జాన్‌ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. మండలంలో ఇద్దరు ఎంఈవోలు విధులు నిర్వహిస్తున్నారు. అయితే ఎంఈవో-1 గా పని చేస్తున్న లక్ష్మి స్థానంలో జాన్‌ప్రసాద్‌ను నియమించారు. ఈ నేపథ్యంలో ఆయన మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంఈవోను పీఆర్‌టీయూ మండలశాఖ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు త్రిమూర్తులు, కె.రాము తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి



బుచ్చెయ్యపేటలో పార్టీ జెండా ఎగరేస్తున్న నాయకులు

బుచ్చెయ్యపేట : సీఎం జగన్‌తోనే అభివృద్ధి జరుగుతుందని, మండల కేంద్రం బుచ్చెయ్యపేటలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వచ్చిన తర్వాత రూ. 38 కోట్ల మేర అభివృద్ధి జరిగిందని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జోగా కొండబాబు తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం జరిగింది. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద నాయకులతో కలిసి ఆయన జెండా ఎగరేసి, అభివృద్ధి కార్యక్రమాల బోర్డు ఆవిష్కరించారు. వైఎస్సార్ రైతు భరోసా కింద 1,275 మంది రైతులకు రూ. 6,33,76,800, అమ్మ ఒడి కింద 751 మంది మహిళలకు రూ. 3,56,81,007 ఖర్చు చేశామన్నారు. గ్రామంలో ఉన్న ప్రజలకు రూ. 38 కోట్లు లబ్ధి చేకూర్చామన్నారు. ప్రజా సంక్షేమం కోసం పాటు పడుతున్న వైసీపీ ప్రభుత్వాన్ని మరలా గెలిపించి టీడీపీ నాయకులకు గుణపాఠం చెప్పాలన్నారు. వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, కోపరేటివ్ అధ్యక్షుడు సుంకరి శ్రీను, సర్పంచ్ సుంకరి లక్ష్మి, స్కూల్ కమిటీ చైర్మన్ పాతాళ సత్తిబాబు, మాజీ సర్పంచ్ సుంకరి గాంధీ తదితరులు పాల్గొన్నారు.

చోడవరం : చోడవరం సచివాలయం-3 పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జెండా, సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. గ్రామ సర్పంచ్ బండి నూకాలమ్మ శ్రీను, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు బొగ్గు శ్యామల, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, ఎంపీటీసీ పొట్నూరి అరుణ, వార్డు మెంబర్లు బీటీ అప్పారావు, ఓరుగంటి నాగమణి, పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నారాయణరావు, సచివాలయ కార్యదర్శి విజయ, సిబ్బంది, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వరి కోతలు



వరి పంట కోస్తున్న కూలీలు

గొలుగొండ : మండలంలో వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ ఏడాది రావణాపల్లి, విప్పలపాలెం, దారగెడ్డ ప్రాంతాల్లో సుమారు 5 వేల ఎకరాల్లో నాట్లు జరిగాయి. ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లో ఒకేసారి కోతలు ప్రారంభం కావడంతో కూలీలకు డిమాండ్ ఏర్పడింది.

కూలీలకు డిమాండ్..

చీడికాడ : పలు గ్రామాల్లో వరి కోతలు జోరుగా సాగుతున్నాయి. కూలీలకు డిమాండ్ ఏర్పడిన నేపథ్యంలో పక్క గ్రామాలకు వెళ్లి రైతులు ముందుగానే ఒప్పందాలు చేసుకుంటున్నారు. సాధారణ రోజుల్లో మహిళా కూలీలకు రోజుకు రూ. 250 కూలీ కాగా ప్రస్తుతం రూ. 400, మోపులు మోసే మగవారికి సాధారణ రోజుల్లో రోజుకు రూ. 400 కాగా ప్రస్తుతం రూ. 600 నుంచి 800 వరకు చెల్లిస్తున్నారు.

కొనసాగుతున్న ధనుర్మాసోత్సవాలు



మాడుగులలో పార్థసారథి స్వామి వారి తిరువీధి ఉత్సవ దృశ్యం

మాడుగుల : అతి పురాతన పార్థసారథి స్వామి ఆలయంలో ఈనెల 16 నుండి ధనుర్మాసోత్సవాలు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో 4వ రోజు మంగళవారం స్వామివారి ఉత్సవ విగ్రహాలకు గ్రామంలో తిరువీధి నిర్వహించారు.

ప్రత్యేక పూజలు, అభిషేకాలు..

మాడుగుల రూరల్ : కె.జె.పురం జంక్షన్‌లో గల కల్యాణ వేంకటేశ్వర స్వామి, మాడుగుల వేంకటేశ్వర స్వామి ఆలయంతో పాటు పార్థసారథి ఆలయంలో స్వామి వారికి అభిషేకాలు, భక్తుల గోత్ర నామాలతో పూజలు చేశారు. పార్థసారథి స్వామి వారి తిరువీధి ఉత్సవం నిర్వహిస్తున్నారు.

గ్రామాల్లో మేలుకొలుపులు..

రోలుగుంట : కొవ్వూరు, రత్నంపేట తదితర గ్రామాల్లో భక్తులు వేకువ జామునే భజనలతో విష్ణుమూర్తిని మేలుకొల్పుతున్నారు. రోలుగుంటలోని సిద్ధి వినాయక సంఘం ఆధ్వర్యంలో వేకువ జామున సిద్ధి వినాయక సంఘం, జీవకారుణ్య సంఘం బృందాలు ఐక్యంగా భక్తి గీతాలతో గ్రామ వీధుల్లో గోదాదేవి, విష్ణుమూర్తిని ఊరేగించారు.

'వంటా వార్పు'తో నిరసన



ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

రోలుగుంట : మండలంలో గల బుచ్చింపేట, రోలుగుంట సెక్టార్ల పరిధిలో గల అంగన్‌వాడీ వర్కర్లు, విద్యా శాఖలో పని చేస్తున్న ఒప్పంద ఉద్యోగులు మంగళవారం స్థానిక మండలాభివృద్ధి కార్యాలయం వద్ద వంటా వార్పుతో నిరసన తెలిపారు. విద్యా శాఖ ఒప్పంద ఉద్యోగులు బుధవారం నుంచి నిరవధిక సమ్మెలో పాల్గొంటున్నట్లు తెలిపారు.

సమగ్ర శిక్ష సిబ్బంది నిరసన..

చోడవరం రూరల్ : సమగ్ర శిక్షలో పని చేస్తున్న ఒప్పంద సిబ్బంది మంగళవారం నాడు నాల్గవ రోజు మండల విద్యా శాఖ కార్యాలయం వద్ద మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, కనీస అలవెన్సు, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. మండల విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది, రిసోర్స్ పర్సన్లు, పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లు పాల్గొన్నారు.

పాఠశాలలకు ట్యాబ్‌ల అందజేత



హెచ్‌ఎంలకు ట్యాబ్‌లు ఇస్తున్న ఎంఈవోలు

నాతవరం: ప్రభుత్వం మండలానికి 300 ట్యాబ్‌లు పంపించిందని ఎంఈవో తాడి అమృత్‌కుమార్ తెలిపారు. ఆయన మంగళవారం స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ట్యాబ్‌లు అందజేశారు. మొత్తం మండలంలో 433 ట్యాబ్‌లు అవసరం కాగా మొదటి విడతగా ఎనిమిది పాఠశాలలకు ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో రెండో ఎంఈవో కామిరెడ్డి వరహాల బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు



నూతన కార్యవర్గం

చోడవరం : చోడవరం స్వయంభూ వినాయక నాయీబ్రాహ్మణ సేవా సంఘం నూతన కార్యవర్గం మంగళవారం ఏర్పడింది. నూతన అధ్యక్షుడిగా రాయవరపు నానాజీ, ప్రధాన కార్యదర్శిగా గోల్కొండ కాశీ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా కాపార్పు నానాజీ, సంయుక్త కార్యదర్శిగా సుందరపల్లి వినోద్, కోశాధికారిగా కనితి దుర్గారావు, సభ్యులుగా ఉప్పాల శ్రీను, మంచుపల్లి శ్రీనివాసరావు, బయ్యవరపు శ్రీను ఎన్నికయ్యారు. సంఘం అభివృద్ధికి పూర్తిస్థాయిలో కృషి చేస్తామని నూతన కార్యవర్గం తెలిపింది.

శివపురంలో అగ్ని ప్రమాదం

- రూ. 3 లక్షల మేర ఆస్తి నష్టం



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

నర్సీపట్నం : శివపురంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంగళవారం ఎ. రాజేష్‌కు చెందిన నాలుగు పోర్షన్లతో కూడిన తాటాకిల్లు అగ్నిప్రమాదానికి దగ్ధమైంది. ప్రమాదంలో ఇంట్లోని ఎలక్ట్రికల్ వస్తువులు, వంట సామగ్రి, బట్టలు కాలి బూడిదయ్యాయి. విషయం తెలుసుకున్న ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసినప్పటికీ ఆస్తి నష్టం వాటిల్లింది. రెవెన్యూ అధికారులు పరిశీలించి, కుటుంబాల వివరాలు, జరిగిన ఆస్తినష్టం తెలుసుకున్నారు.

ప్రత్యేక కార్యాచరణతో నియోజకవర్గ అభివృద్ధి



పెంటయ్యపాలెంలో ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న రాజారామ్ తదితరులు

మాడుగుల రూరల్ : నియోజకవర్గాన్ని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రత్యేక కార్యాచరణతో అభివృద్ధి చేశారని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ అన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం సాయంత్రం పోతనపూడి శివారు పెంటయ్యపాలెంలో అభివృద్ధికి సంబంధించిన ఫ్లెక్సీని పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. వి.వి.అగ్రహారం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోరుకొండ చెల్లంనాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సచివాలయ పరిధిలో గల ప్రజలతో సమావేశం అయ్యారు. అనంతరం పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ శనాపతి కొండలరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, గొల్లవిల్లి రాజేశ్, స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దివ్యాంగ బాలలపై ప్రత్యేక దృష్టి



దివ్యాంగ బాలలకు దుస్తులు, సామగ్రి పంపిణీ చేస్తున్న అధికారులు

నాతవరం: సమాజంలో దివ్యాంగ బాలలను ప్రతి ఒక్కరు గౌరవించాలని ఎంపీడీవో హనుమంతరావు అన్నారు. మండల కేంద్రం యూపీ స్కూల్లో మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. స్థానిక ఎంఈవో తాడి అమృత్ కుమార్ సొంత నిధులతో దివ్యాంగ బాలలకు సమకూర్చిన దుస్తులు, ఇతర సామగ్రిని ఎంపీడీవో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఈవో అమృత్‌కుమార్ మాట్లాడుతూ దివ్యాంగ బాలలకు ప్రభుత్వం అనేక సదుపాయాలు కల్పిస్తుందన్నారు. మండలంలో సహిత విద్యా కేంద్రాల ద్వారా 103 మంది చదువుతున్నారన్నారు. ఆయా కేంద్రాల దివ్యాంగ బాలలకు ప్రభుత్వం అలవెన్సుతో పాటు సకాలంలో ఇతర సదుపాయాలు కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 కామిరెడ్డి వరహాల బాబు, ఈఆర్టీ వర్రే స్వామినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

బంక్ ఏర్పాటు పనుల పరిశీలన



ఎ.కోడూరులో బంక్ ఏర్పాటు పనులు పరిశీలిస్తున్న డీసీసీబీ డైరెక్టర్ చల్లా

కె.కోటపాడు : పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఎ.కోడూరు గ్రామంలో హెచ్‌పీ బంక్ ఏర్పాటుకు అనుమతులు మంజూరైనట్లు డీసీసీబీ డైరెక్టర్ చల్లా సత్యనారాయణమూర్తి తెలిపారు. ఈ నెల 21న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చేతుల మీదుగా బంక్ నిర్మాణానికి సంబంధించి భూమి పూజ, శిలాఫలకం ఆవిష్కరణ జరపనున్నట్లు ఆయన తెలిపారు. ఈ పనులకు సంబంధించి మంగళవారం పనులను ఆయన పరిశీలించారు. భూమి పూజలో డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడితో పాటు డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు, సీఈవో వర్మ, డీసీవో పీఎస్ కిరణ్‌కుమారి, ఆప్కాబ్ ఏజీఎం జీవీఎస్ఎన్ రాజు, ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, జెడ్పీటీసీ ఈర్లె అనురాధ పాల్గొంటారని ఆయన తెలిపారు.

జన్నవరం పాఠశాలకు కంప్యూటర్ వితరణ



కంప్యూటర్, ప్రింటర్ అందజేస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

చోడవరం రూరల్ : మండలంలోని జన్నవరం గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు విశాఖ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ప్రొఫెసర్ దుర్గాప్రసాద్, కార్యదర్శి నరసింహనాయుడు స్వయంగా పాఠశాలకు వచ్చి కంప్యూటర్, ప్రింటర్ అందజేశారు. బెన్నవోలు గ్రామ సర్పంచ్ మూడెడ్ల శంకరరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ భూకంపం వచ్చినా, సునామీ తలెత్తినా చెక్కు చెదరనిది విద్య అన్నారు లయన్స్ క్లబ్ సేవలు ప్రశంసనీయం అన్నారు. జన్నవరం సర్పంచ్ కోశం సన్యాశిరావు, మాజీ సర్పంచ్ సాలాపు శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు బైన ఈశ్వరరావు, తిమ్మనపాలెం సర్పంచ్ గొర్లె శ్రీను, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.